# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 25, జులై 2026


## ఫుడ్ ఫాయిజన్ జరగలేదు

### అజీర్తి సమస్యతోనే వాంతులు చేసుకున్నారు : ఉమ్మడి జిల్లా ఆర్సీవో శ్రీధర్

బెల్లంపల్లి, జూలై 24, ప్రభాతవార్త

బెల్లంపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో బుధవారం సాయంత్రం ఆసుపత్రిలో చేరిన విద్యార్థినులకు ఎటువంటి ఫుడ్ పాయిజన్ లాంటిది జరగలేదని ఎంజేపీ పాఠశాలల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం విద్యార్థినులకు అజీర్తి సమస్యల వల్ల వాంతులు వచ్చి, కడుపునొప్పి సమస్యలు వచ్చాయని వారందరికీ పాఠశాలలోనే ప్రథమ చికిత్స అందించినప్పటికీ పిల్లల ఆరోగ్య దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే వారిని ఆసుపత్రిలో చేర్పించినట్టు ఆయన వెల్లడించారు. విద్యార్థినులకు ఆసుపత్రిలో నిర్వహించిన టెస్ట్ ఫలితాలన్నీ నెగటివ్ గానే వచ్చాయని అందులో కూడా ఎక్కడ ఎలాంటి ఫుడ్ పాయిజన్ ఆనవాల్లు లేవన్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేని కారణంగా ఆసుపత్రి వైద్యులు వారిని 12 నుంచి 14 గంటల్లోనే డిశ్చార్జ్ చేసి పాఠశాలకు పంపడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉండడమే కాక వారందరినీ సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పజెప్పడం జరిగిందని ఆర్సీవో వివరించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు 23వ తేదీ ఉదయాన్నే డీఎం అండ్ హెచ్వో నరేందర్ రాథోడ్ పాఠశాలలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారని ఆర్సీవో వివరించారు. జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ వాసురామ్ పాఠశాలను సందర్శించి కిచెన్ పరిసరాలు, స్టోరేజ్ రూమ్ పరిశీలించి, పాఠశాలలోని పరిస్థితి సమీక్షించడమే కాక కొన్ని ఫుడ్ శాంపిల్స్‌ని టెస్టింగ్‌కి పంపడం జరిగిందన్నారు. ఈ ఘటనపై సొసైటీ అధికారులకు జిల్లా అధికారులకు తగు నివేదికను పంపినట్లు ఆయన వివరించారు.



## కేసీఆర్ స్ఫూర్తితోనే గ్రీన్ ఇండియా ఛాలెంజ్

- బాసర అమ్మవారి సన్నిధిలో రాజ్యసభ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ ప్రత్యేక పూజలు

భైంసా, జులై 24, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆచరణలో భాగంగా తెచ్చిన హరితహారం స్ఫూర్తితోనే గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని రాజ్యసభ మాజీ ఎంపీ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినపల్లి సంతోష్ కుమార్ తెలిపారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసర మండలం బిద్రెల్లి గ్రామానికి చేరుకున్న ఆయనకు సరిహద్దు వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బిద్రెల్లి గ్రామంలో ఆయన మొక్కలు నాటారు. అంతకుముందు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా సంతోష్ కుమార్ మిగతా 2లో..

## చట్టబద్ధంగా ప్రజలకు న్యాయం చేయడమే పోలీసుల బాధ్యత

- రామగుండం పోలీస్ కమిషనర్ (సిపి) అంబర్ కిషోర్ ఝా

తాండూర్, జూలై 24, ప్రభాతవార్త :

ప్రతి పోలీసు విధి నిర్వహణలో ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించి, చట్టబద్ధంగా ప్రజలకు న్యాయం చేయడమే ప్రధాన బాధ్యత అని రామగుండం పోలీస్ కమిషనర్ (సిపి) అంబర్ కిషోర్ ఝా అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం సిపి తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న సీపీకి మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీ కిరణ్ కుమార్,సీఐ దేవయ్య పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. సర్కిల్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల సీడీ ఫైళ్ళు, పెండింగ్ ట్రయల్ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను సిపి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపి మిగతా 2లో..



## డిజిటల్ రీ సర్వేతో భూ వివాదాలకు చెక్



- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, జూలై 24, ప్రభాతవార్త

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. శుక్రవారం నెన్నెల మండలం చిన్న వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల తహసిల్దార్ శ్రీనివాస్‌తో కలిసి హాజరైన ఆయన, భూ సర్వే ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల సర్వే, రీ సర్వే ద్వారా భూ వివాదాలు తగ్గి, భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. భూములకు సంబంధించిన మిగతా 2లో..

### మంచిర్యాలకు మహామార్గం...

## ఢిల్లీ గడప తట్టిన వెరబెల్లి

- కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రికి వినతిపత్రం
- కొత్త జాతీయ రహదారి నిర్మాణంతో ప్రయాణ సమయం తగ్గి, ప్రమాదాలకు చెక్ పడుతుందని విజ్ఞప్తి

మంచిర్యాల, జూలై 24, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మంచిర్యాల–హైదరాబాద్ మధ్య కొత్త జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై అధిక వాహన రద్దీ కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు భద్రత కల్పించడంతో పాటు వేగవంతమైన రవాణా కోసం మంచిర్యాల– కరీంనగర్– హైదరాబాద్ మార్గంలో కొత్త జాతీయ రహదారిని మిగతా 2లో..

## అంతర్రాష్ట్ర సుపారీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన నిర్మల్ పోలీసులు




- ప్రత్యేక బృందాల చాకచక్యంతో సంచలన హత్య కేసు ఛేదన

నిర్మల్, జులై 24, ప్రభాతవార్త:

సంచలనం సృష్టించిన అస్లాం ఖాన్ హత్య కేసును నిర్మల్ పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు అంతర్రాష్ట్ర సుపారీ ముఠాను అరెస్ట్ చేశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు అస్లాం ఖాన్ సవితి తల్లి అన్వరీ బేగం (ఎ1) ఈ హత్యకు ప్రధాన కుట్రదారు. తనతో ఉన్న అక్రమ సంబంధాన్ని తెంచుకుని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాడనే కక్షతో, రూ.6 లక్షలకు మహారాష్ట్రకు చెందిన ముఖీద్‌తో సుపారీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో ఈ నెల 15న వైఎస్సార్ కాలనీ సమీపంలో మాటువేసిన సుపారీ గ్యాంగ్, అస్లాం ఖాన్‌ను ఆటో నుంచి లాగి కత్తులతో విచక్షణారహితంగా నరికి హత్య చేసింది. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాందేడ్‌కు చెందిన సుపారీ సభ్యులు ముఖీద్, అఫ్రోజ్, షేక్ షాహిద్, సాయినాథ్ పవార్‌లతో పాటు షేక్ మహమ్మద్‌లను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితురాలు అన్వరీ బేగంను ఇదివరకే అరెస్ట్ చేసి మిగతా 2లో..

# డిజిటల్ రీ సర్వేతో భూ వివాదాలకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

హద్దులను ఖచ్చితంగా నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు ముగింపు పలకవచ్చని చెప్పారు. పట్టాదారుల వివరాలు, మోకా రికార్డులు, పాత పత్రాలు వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలోని ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించబడతాయని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూములపై పూర్తి స్పష్టత ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి వాటిపై ఎలాంటి ఆక్రమణలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టా ఉన్నా మోకాలో లేని భూములు, మోకాలో ఉన్నా పట్టా లేని భూముల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతికతతో మ్యాపింగ్ చేపట్టి, రికార్డులను సరిచేసి, సర్వే నెంబర్ల ప్రకారం హద్దులను ఖచ్చితంగా నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఒకసారి మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మార్పులు చేయడం కష్టమవుతుందని, కాబట్టి రైతులు తమ భూముల వివరాలను స్పష్టంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. సర్వేయర్లు, ప్రజల సమన్వయంతో ఈ ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. భూ సమస్యలు తలెత్తిన సందర్భంలో న్యాయపరమైన చర్యలకు కూడా ఈ మ్యాపింగ్ ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. అంతకుముందు కలెక్టర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సాదా బైనమా దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ దాదాపు 90 శాతం పూర్తయ్యిందని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల వద్ద ఉన్న ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో సేకరించి, బూత్ స్థాయి అధికారులు యాప్‌లో వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. తదనంతరం చిన్న వెంకటాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, వర్షాకాలంలో వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు గైర్హాజరు అయినట్లు గమనించిన కలెక్టర్, గైర్హాజరు కారణాలను తెలుసుకుని, సెలవు పత్రం లేకుంటే షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు అందుతున్న సౌకర్యాలు, పోషకాహార నాణ్యతపై సమీక్షించి పలు సూచనలు చేశారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవన పనులను పరిశీలించిన కలెక్టర్, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సర్పంచ్ మరియు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# జిల్లా వ్యాప్తంగా ఇంటర్, ఉన్నత విద్యాసంస్థల బంద్ విజయవంతం

**ఆసిఫాబాద్, జూలై 24, ప్రభాతవార్త :**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్, ఉన్నత విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు బంద్ నిర్వహించగా, పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు జమీర్ మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పోటీ పరీక్షల్లో జరిగిన అక్రమాలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని విమర్శించారు. విద్యార్థుల శాంతియుత నిరసనలపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యూబ్ ఖాన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టికానంద్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, పీడీఎస్‌యూ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సమీర్, నాయకులు శివశంకర్, శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ముబారక్ తదితరులు పాల్గొన్నారు.




# సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీఆర్ఎం

## - ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 24, ప్రభాతవార్త :**

దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) గోపాలకృష్ణన్, సీనియర్ డీఓఈ ఎం. మహేంద్ర వర్మతో కలిసి శుక్రవారం సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోని వివిధ వసతులు, సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలు, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతం, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ భద్రత, తాగునీటి సౌకర్యం, వెయిటింగ్ హాళ్లు, ప్లాట్‌ఫారాల నిర్వహణ, పారిశుధ్యం, శుభ్రత తదితర అంశాలను డీఆర్ఎం పరిశీలించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్టేషన్‌లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సౌకర్యం, వెయిటింగ్ హాళ్లు, పార్కింగ్ ప్రాంతం తదితర ప్రయాణికుల అవసరాలకు సంబంధించిన అంశాలను సమీక్షించి, అవసరమైన చోట తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ భద్రతా ప్రమాణాలను పరిశీలించిన డీఆర్ఎం ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, రైల్వే శాఖ అందిస్తున్న సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీఆర్ఎం అధికారులకు సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు, తదితరులు ఉన్నారు.



# అంతర్రాష్ట్ర సుపారీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన నిర్మల్ పోలీసులు

(మొదటిపేజీ తరువాయి)

రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి స్కార్పియో కారు, మోటార్ సైకిల్, రెండు కత్తులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన ఎస్‌డీపీఓ పి. శ్రీనివాస్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, సీఐ ఎం. కృష్ణ, ఎస్ఐలు లింబాద్రి, శ్రీకాంత్, గోపీ, గణేష్, సాయి కృష్ణ, రవీంద్ర నాయక్, అశోక్, కృష్ణారెడ్డిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# చట్టబద్ధంగా ప్రజలకు న్యాయం చేయడమే పోలీసుల బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ సిఐలు తమ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు. సిబ్బంది విధి నిర్వహణను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, కేసులు పెండింగ్లో లేకుండా ఎస్ఐలకు, పోలీస్ సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్ల హిస్టరీ, వారిపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని సూచించారు. భూ వివాదాలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా, నిజాయితీతో విచారించి, చట్టబద్ధంగా దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తులపై అనవసరంగా బలప్రయోగం చేయరాదని, శాంతిభద్రతల పరిరక్షణలో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మేరకే చట్టబద్ధమైన బలాన్ని వినియోగించాలని సూచించారు. నేరాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో ప్రివెంటివ్ పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. నేరాల దర్యాప్తులో ఎస్ఐ స్థాయి నుంచి పైస్థాయి అధికారులందరూ సీసీటీఎన్ఎస్, సమాచార సాంకేతికత (ఐటీ), ఆధునిక పోలీసింగ్‌లో వినియోగిస్తున్న సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో సాంకేతికత వినియోగం మరింత పెరుగుతుందని, ప్రమోషన్లతో బాధ్యతలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి అధికారి తమ సాంకేతిక నైపుణ్యాలను (సాఫ్ట్ స్కిల్స్) అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ వచ్చే పిటిషనర్లు, పౌరుల పట్ల ఓర్పుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, చట్ట పరిధిలో సాధ్యమైనంత వరకు సహాయం అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిపి హెచ్చరించారు. అంతకు ముందు సర్కిల్ కార్యాలయం ఆవరణలో సిపి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో మాదారం, తాండూర్ ఎస్సైలు సౌజన్య, ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్ స్ఫూర్తితోనే గ్రీన్ ఇండియా ఛాలెంజ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గ నాయకురాలు పడకంటి రమాదేవి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోర్వ శ్యామ్, కోమ్రేవార్ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రతిమను అందజేశారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌లో కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నేతలు బాబారావు, గణపత్‌రావు కదమ్‌లతో కలిసి సంతోష్ కుమార్ మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరించి ఆకుపచ్చని ఫలితాలు ఇస్తుండటం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# మంచిర్యాలకు మహామార్గం... ఢిల్లీ గడప తట్టిన వెరబెల్లి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించాలని కోరారు. నాగపూర్–హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని మంచిర్యాల మీదుగా నిర్మిస్తే జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వెరబెల్లి వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్ చేరుకోవడానికి సుమారు ఐదు గంటలు పడుతుండగా, కొత్త రహదారి అందుబాటులోకి వస్తే మూడు గంటలలోపే గమ్యస్థానానికి చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం వేలాది మంది మంచిర్యాల నుంచి కరీంనగర్, హైదరాబాద్ నగరాలకు ప్రయాణిస్తున్నారని, వారికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. కొత్త జాతీయ రహదారి నిర్మాణం వల్ల సరుకు రవాణా వేగవంతమై పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ఊతం లభించడంతో పాటు జిల్లా అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే జాతీయ రహదారిని మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని వెరబెల్లి విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**✪ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ ✪ అభిమానుల సందడిలో కేక్ కట్ చేసిన దివాకర్ రావు**

**బజార్‌హత్నూర్, జులై 24, ప్రభాతవార్త:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు దుబ్బుల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులతో కేటీఆర్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాబోయే కాలంలో యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయన్న, గులాబ్ తండా మాజీ సర్పంచ్ గంగాసాగర్, నాయకులు చట్ల వినీల్, తాండ్ర శ్రీనివాస్, బొమ్మిడి సంజీవ్, చట్ల తరుణ్, తడక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, జూలై 24, ప్రభాతవార్త**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి పట్టణంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బెల్లంపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్వయంగా పర్యవేక్షిస్తూ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఒక్కొక్కరిని పరామర్శించిన నాయకులు, వారి ఆరోగ్య పరిస్థితిని వివరంగా అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. రోగులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలోని వసతులు, వైద్య సేవలపై కూడా కొంతమంది నాయకులు ఆరా తీసినట్లు సమాచారం. కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని, ఆయన ఎల్లప్పుడూ ప్రజాసేవకే ప్రాధాన్యం ఇస్తారని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమకు గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు, యువ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ఆసుపత్రి పరిసరాల్లో సందడి నెలకొంది.



**మంచిర్యాల, జూలై 24, ప్రభాతవార్త**

భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాలనీలోని మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు నివాసంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ, కేటీఆర్ సమర్థ నాయకత్వంతో తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజా సంక్షేమం, యువతకు అవకాశాల కల్పన, పారిశ్రామిక అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజా సేవలో ఆయన మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కేక్ పంపిణీ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

**నస్పూర్, జూలై 24, ప్రభాతవార్త**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను శుక్రవారం నస్పూర్ పట్టణంలోని సిసిసి కార్నర్ వద్ద ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నస్పూర్ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులు భారీగా పాల్గొని కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి, ఐటీ రంగానికి కేటీఆర్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నస్పూర్ పట్టణ కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, 4వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు వంగ తిరుపతి, పూదరి కుమార్, నాయకులు బండి రమేష్, పోగాకు రమేష్, కుమ్మం రాజేశ్వర్ రెడ్డి, రఫీ ఖాన్, జాడి భానుచందర్, వేల్పుల రాజేష్, రుకుం తిరుమల్, ఒడ్డె వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



**కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు**

**తాండూర్, జులై 24, ప్రభాతవార్త :**

మండలంలోని ఐబి కేంద్రంలో శుక్రవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్క రాంచందర్, మాసాడి శ్రీరాములు, గట్టు సంతోష్, సురేష్, ప్రణయ్ కుమార్, అబుసాద్, జాడి పోషం, రావుల స్వామి, మణికుమార్, బాబుఖాన్, తదితరులు పాల్గొన్నారు.



**సిసిసి కార్నర్ వద్ద కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు**



**తాండూర్ మండలం ఐబిలో కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు**

# ముల్కల మల్లారెడ్డి పార్థివదేహానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి నివాళులు

**- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా**

**మంచిర్యాల, జూలై 24, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత ముల్కల మల్లారెడ్డి మృతికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానికంగా ముల్కల మల్లారెడ్డి నివాసానికి చేరుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, ముల్కల మల్లారెడ్డి 2013లో భారతీయ జనతా పార్టీలో చేరి పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. 2014 శాసనసభ ఎన్నికల్లో పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి పార్టీ అభివృద్ధికి తన వంతు సేవలందించారని పేర్కొన్నారు. ఆయన మరణంతో భారతీయ జనతా పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, జాతీయ వెనుకబడిన వర్గాల మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ కూడా ముల్కల మల్లారెడ్డి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించినట్లు తెలిపారు. మల్లారెడ్డి కుటుంబానికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ముల్కల మల్లారెడ్డికి ఘనంగా తుది వీడ్కోలు పలికారు.



# వైభవంగా శ్రీ శాకంబరి యుక్త వారాహి నవరాత్రి ఉత్సవాలు

### ఘనంగా చండీ హోమం.. పాల్గొన్న మేయర్ ధరణి మధుకర్, జీఎం మునిగంటి శ్రీనివాస్

నస్పూర్, జూలై 24, ప్రభాతవార్త

నస్పూర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ గణపతి శివ మార్కండేయ మహా దుర్గా దేవాలయంలో ఆలయ కమిటీ, నస్పూర్ పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ శాకంబరి యుక్త వారాహి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ నెల 15వ తేదీ (ఆషాఢ శుద్ధ పాడ్యమి) నుండి 23వ తేదీ (ఆషాఢ శుద్ధ నవమి) వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి తొమ్మిది రకాల కుంకుమలతో నిత్య లలితా సహస్రనామ పారాయణంతో కుంకుమార్చన, మహా కుంకుమాభిషేకం, మహిళలచే విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా 108 సార్లు లలితా సహస్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమాభిషేకాలు పూర్తిచేశారు. నవరాత్రి మహోత్సవాల సంపూర్ణ ఫలప్రాప్తి కొరకు శుక్రవారం ఆలయ అర్చకులు శ్రీరాంభట్ల ఆనంద్ శర్మ, శ్రీరాంభట్ల సాత్విక్ శర్మ, శ్రీరాంభట్ల ఆకాష్ శర్మల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో అమ్మవారికి 25 పట్టుచీరలు, బంగారు ముక్కుపుడక, వెండి పాదాల పట్టీలను పూర్ణాహుతిగా సమర్పించారు. ఈ చండీ హోమం మరియు ముగింపు వేడుకల్లో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ దంపతులు, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ దంపతులు ప్రత్యేకంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ధరణి మధుకర్, జీఎం మునిగంటి శ్రీనివాస్ లు మాట్లాడుతూ.. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. హోమానంతరం భక్తులకు విస్తృతంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ కమిటీ, పద్మశాలి సంఘం సభ్యులు చేసిన విశేష ఏర్పాట్లపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, నస్పూర్ పద్మశాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



చండీ హోమంలో పాల్గొన్న మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, జీఎం మునిగంటి శ్రీనివాస్ దంపతులు



## విద్యాసంస్థల బంద్ విజయవంతం

### - నీట్ లీకేజీపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

### - కాంగ్రెస్ నాయకుల డిమాండ్

సారంగాపూర్, జులై 24, ప్రభాతవార్త:

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు శుక్రవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూచాడి శ్రీహరి రావు ఆదేశాల మేరకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేయించి విద్యార్థి సంఘాలకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. బంద్‌కు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. నీట్ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ ప్రవేశ పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ కావడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఆసిఫాబాద్ జూలై 24, ప్రభాతవార్త :

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని జిల్లా ఎక్సైజ్ సూపర్ ఇంటెండెంట్ లక్ష్మా నాయక్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డులోని గౌడ సంఘం స్థలంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్హెచ్ఓలను గౌడ సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్హెచ్ఓ రాజేశ్వర్, గౌడ సంఘం నాయకులు రాము గౌడ్, మోహన్ గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### - జూనియర్ సివిల్ జడ్జి ఆర్.కె. వెంకటరమణ సుహాస్

### - ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

భైంసా, జూలై 24, ప్రభాతవార్త:

మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడరాదని భైంసా జూనియర్ సివిల్ జడ్జి ఆర్.కె. వెంకటరమణ సుహాస్ అన్నారు. భైంసా పట్టణంలోని గురుకుల ఒకేషనల్ కళాశాలలో "మాదకద్రవ్యాల దుర్వినియోగం, యాంటీ ర్యాగింగ్" అంశంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల వ్యసనం ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ర్యాగింగ్ చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని స్పష్టం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. భైంసా టౌన్ సీఐ సాయికిరణ్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అంజద్ షేక్, దుసంవాడ్ చిన్నన్న, కళాశాల చైర్మన్ రామకృష్ణ గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం సన్మానించింది.





## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - జాతర్ల వసతి గృహంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

బజార్‌హత్నూర్, జులై 24, ప్రభాతవార్త:

వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నవీన్ రెడ్డి సూచించారు. జాతర్ల వసతి గృహంలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం వల్ల కలుషిత నీరు, దోమల సంతతి పెరిగి డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వేగంగా వ్యాపిస్తాయని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ఆహారంపై ఈగలు వాలకుండా వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. అలాగే జ్వరం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, సొంతంగా మెడికల్ షాపుల్లో మందులు వాడకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో సూర్యప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పి రావళి, ఏఎన్ఎం అర్చన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామస్తులు ఇంద్రజల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్, జూలై 24, ప్రభాతవార్త:

మండలంలోని గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంద్రజల పథకాన్ని సర్పంచ్ పూసల ప్రియాంకభీమేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి ఎద్దడిని నివారించి, మెరుగైన నీటి సౌకర్యం అందించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని, ప్రజలందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొల్లెన రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, వార్డు సభ్యులు, ఏఈఓ భోజన్న, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, టీఏ సోని, గ్రామస్తులు పాల్గొన్నారు.



## యోగా మాస్టర్ ఉప్పు రవీందర్‌కు ఎమ్మెల్యే రామారావు పటేల్ సన్మానం

భైంసా, జూలై 24, ప్రభాతవార్త:

ఇటీవల నేషనల్ ఎడ్యుకేటర్ ఐకాన్ అవార్డు సాధించిన భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన యోగా మాస్టర్ ఉప్పు రవీందర్‌ను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శుక్రవారం భైంసాలో శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యోగాలో నైపుణ్యం సాధించి జాతీయ స్థాయిలో అవార్డు పొందడం అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు యోగా ప్రాముఖ్యతను తెలియజెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అమోల్, నాయకులు చింతపండు మహేష్, శివాజీ పటేల్, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.



# పోర్టబుల్ ఎక్స్‌రే ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించాలి

**వర్షాల వేళ కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్**

**సీతారాంపల్లి రైతు వేదికలో మెగా వైద్య శిబిరం, 123 మందికి వైద్య పరీక్షలు.. ఉచిత మందుల పంపిణీ**

**నస్పూర్, జూలై 24, ప్రభాతవార్త**

క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా పోర్టబుల్ మొబైల్ ఎక్స్ రే యంత్రాల ద్వారా వైద్య శిబిరాలకు వచ్చేవారందరికీ ఎక్స్ రే, తెమడ పరీక్షలు నిర్వహిస్తూ వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిగల సీతారాంపల్లి రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జాతీయ అసంక్రమణ వ్యాధుల కార్యక్రమంలో భాగంగా 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి సమయానికి మందులు అందజేయాలని సూచించారు. వ్యాధిగ్రస్తుల వివరాలను నక్షయ్ పోర్టల్‌లో నమోదు చేస్తూ ఎన్జీవోల సహకారంతో పోషకాహార కిట్లను అందజేయాలన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గన్యా వంటి కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, క్రమం తప్పకుండా డ్రై డే పాటించాలని ఆదేశించారు. వారానికి ఒకసారి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కల్తీ, బయట రోడ్లపై అమ్మే ఆహార పదార్థాలను తినకూడదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో మాతా శిశు సంరక్షణ, టీకాల పంపిణీతో పాటు 14 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ సేవలు అందించినట్లు తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరంలో మొత్తం 123 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, స్థానిక కార్పొరేటర్ సురిమిళ్ల సౌమ్య, వైద్యాధికారులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ ప్రియాంక, సలోని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాందేవ్, టీబీ పర్యవేక్షకులు సాయి రెడ్డి, రాజేష్, రషీద్‌తో పాటు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్



## గురుపూర్ణిమ ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఆలయ అధికారులు

**భైంసా, జులై 24, ప్రభాతవార్త:**

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో ఈ నెల 29 నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్న గురుపౌర్ణమి ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ అధికారులు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను శుక్రవారం భైంసాలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లపై ఆలయ ఈవో అంజలీదేవితో ఎమ్మెల్యే చర్చించారు. భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, వేద పండితులకు నిర్వహించే సన్మాన కార్యక్రమం తదితర అంశాలపై సమీక్షించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమైన దృష్ట్యా పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.



## నేడు దేగాంలో శ్రీ ఏకలవ్య జయంతి వేడుకలు

**- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ ఏకలవ్య ఎరుకల యువజన సంక్షేమ సంఘం పిలుపు**

**భైంసా, జులై 24, ప్రభాతవార్త:**

భైంసా మండలం దేగాం గ్రామంలో శనివారం ఉదయం 10:00 గంటలకు నిర్వహించనున్న శ్రీ ఏకలవ్య జయంతి వేడుకలను విజయవంతం చేయాలని శ్రీ ఏకలవ్య ఎరుకల యువజన సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమానికి ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి, దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి, ఉపసర్పంచ్ శివాజీ, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ఈ. ఎల్లన్న, వీడీసీ ఛైర్మన్ నాని లక్ష్మణ్, వీడీసీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, యువకులు, గ్రామ పెద్దలు విచ్చేసి తమ అమూల్యమైన సందేశాన్ని అందించాలని సంఘం సభ్యులు ఆహ్వానించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

**ఆసిఫాబాద్, జులై 24, ప్రభాతవార్త :**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మాట్ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఆర్థిక, పాలనాపరమైన అక్రమాలు వెలుగుచూడటంతో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రికార్డుల్లో ఉన్న లైట్లు క్షేత్రస్థాయిలో లేకపోవడం, స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు డ్రా చేయడం, అసంపూర్తి పనులకు నిధులు విడుదల చేయడం వంటి లోపాలతో బెజ్జూర్ జీపీ కార్యదర్శి వైకుంఠంకు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా అధిక ధరలకు లైట్లు కొనుగోలు, 15వ ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు, సరఫరాదారులకు కాకుండా వ్యక్తికి నేరుగా నగదు చెల్లించడం వంటి అక్రమాలు వెలుగుచూడటంతో రవీంద్రనగర్-1 జీపీ మాజీ కార్యదర్శి విజయ్ కు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018 ప్రకారం వీరిపై ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో 3 రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని, లేనిచో నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని సూచించారు.

## వ్యవసాయ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలి

**ఆసిఫాబాద్, జూలై 24, ప్రభాతవార్త :**

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ (ఆపరేషన్స్) టి. మధుసూదన్ ఆదేశించారు. శుక్రవారం చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) అశోక్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడేతో కలిసి కాగజ్‌నగర్‌లో డివిజన్ ఏఈలు, సబ్ ఇంజనీర్లు, ఏడీఈలు, డీఈలు, ఎస్ఏఓలు, ఏవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలని, విద్యుత్ పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ వినియోగదారుల ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. అనంతరం కాగజ్‌నగర్ పవర్ కాంపౌండ్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి మరమ్మత్తుల నాణ్యతను పరిశీలించారు. అవసరమైన సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 132 కేవీ కాగజ్‌నగర్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆసిఫాబాద్‌లో నూతనంగా నిర్మించిన 5 కిలో మీటర్ల 33 కేవీ విద్యుత్ లైన్‌ను ప్రారంభించారు. ఈ లైన్ ద్వారా వాంకిడి మండలంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుందన్నారు. అదేవిధంగా దట్టమైన అటవీ ప్రాంతం గుండా వెళ్లే 33 కేవీ తిర్యాని లైన్‌పై చేపట్టిన కవర్డ్ కండక్టర్ పనులను పరిశీలించి, అటవీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు చేపడుతున్న చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈ (ఎంఆర్టీ) వీరేశ్, ఏడీఈ (ఓపీ) డి. శ్రీనివాస్, ఏడీఈ (ట్రాన్స్‌కో) గోపాల్, ఎస్ఏఓ దేవిదాస్, ఏఈలు రవీందర్, ఫిరోజ్ ఖాన్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



33 కేవీ విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ డైరెక్టర్ (ఆపరేషన్స్) టి. మధుసూదన్



## విద్యార్థులపై దాడులను ఖండిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భర్తరఫ్‌కు డిమాండ్

**- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యాసంస్థల బంద్**

**బెల్లంపల్లి, జూలై 24, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రంలో వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఈరోజు విద్యాసంస్థల బంద్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అభిషేక్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో విద్యార్థులు, యువతపై జరుగుతున్న దమనకాండను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై ప్రభుత్వం నిర్బంధ చర్యలు తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులు, యువతపై జరిగిన లాఠీచార్జ్, బాష్పవాయువు ప్రయోగం వంటి ఘటనలు సిగ్గుచేటని విమర్శించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం బ్రిటీష్ పాలనను తలపించే విధంగా వ్యవహరిస్తోందని, విద్యార్థి ఉద్యమాలను అణచివేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విద్యార్థులు, యువతపై జరిగిన దాడులకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా ఈ బంద్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు), ఏఐఎఫ్డిఎస్, పిడిఎస్యు, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ వార్డ్ సభ్యుల ఫోరం ఆవిర్భావం.. జిల్లా కన్వీనర్‌గా జావిద్ ఎన్నిక

**ఆసిఫాబాద్ టౌన్, జూలై 24, ప్రభాతవార్త :**



తెలంగాణ వార్డ్ సభ్యుల ఫోరం కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్‌గా జావిద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ ఆ సంఘం రాష్ట్ర కమిటీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సంక్షేమం, హక్కుల సాధన లక్ష్యంగా రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అనుబంధంగా తెలంగాణ వార్డ్ సభ్యుల ఫోరం ఆవిర్భవించింది. హైదరాబాద్‌లోని బేగంపేట కంట్రీ క్లబ్‌లో రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ అధ్యక్షతన జరిగిన ఆవిర్భావ సభలో ఈ ప్రకటన చేశారు. ఇటీవల జిల్లా సమావేశంలో వార్డు సభ్యుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా నాయకుడిగా ప్రకటించిన జావిద్‌ను రాష్ట్రస్థాయి వేదికపై జిల్లా కన్వీనర్‌గా అధికారికంగా ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం జనరల్ సెక్రెటరీ మట్ట శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు కవిత, వార్డ్ సభ్యుల ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కనకమామిడి విష్ణు, రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర సురేష్‌లు జావిద్‌కు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

## ఘనంగా గోరింటాకు వేడుకలు

**ఆసిఫాబాద్, జులై 24, ప్రభాతవార్త :**



ఆషాఢ మాసం సందర్భంగా పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని గోరింటాకును సేకరించి అమ్మవారికి నివేదించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సభ్యుల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. పూజల అనంతరం ఆడపడుచులు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని ఆషాఢ మాస విశిష్టతను చాటుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు, యువతులు కూడా ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది ఈ గోరింటాకు వేడుకలను నిర్వహిస్తున్నట్లు మహిళా సంఘం సభ్యులు తెలిపారు. గోరింటాకు భారతీయ సంస్కృుృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రకృతి సిద్ధమైన గోరింటాకు చేతులకు చల్లదనాన్ని అందించడంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి సంప్రదాయ వేడుకలు కుటుంబ బంధాలను, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు జంజిరాల పుష్పలత, కోశాధికారి అనుమాండ్ల క్రాంతి, గౌరవ అధ్యక్షురాలు వనమాల జయ, ప్రచార కార్యదర్శి గుజ్జ రేవతి, ఇరుకుల్ల పుష్పలత, అనుమాండ్ల సుజాత, అనుమాండ్ల లహరి,పొన్న సంగీత, ఇరుకుల్ల కావ్య, ఇరుకుల్ల అనసూయ, ఆవిడపు రేఖ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్

**ఆసిఫాబాద్ టౌన్, జూలై 24, ప్రభాతవార్త :**



రైతులకు ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయించే ఫెర్టిలైజర్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫెర్టిలైజర్ దుకాణ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగుమందులను విక్రయించాలని సూచించారు. నిషేధిత మోనోక్రోటోఫాస్, ప్యారాక్వాట్ పురుగుమందులను విక్రయించరాదని స్పష్టం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తారని, రైతులకు విక్రయించిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. దుకాణాలపై రైతుల నుంచి ఫిర్యాదులు అందితే విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి మిలింద్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

## సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన

### - చర్లపల్లిలో క్షేత్రసందర్శన

**బెల్లంపల్లి, జూలై 24, ప్రభాతవార్త**



హోసజ వ్యవసాయ జాతీయ మిషన్‌లో భాగంగా చర్లపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సహజ వ్యవసాయం పై అవగాహన కార్యక్రమం నిర్వహించి క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమాకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ రసాయన ఎరువులు, పురుగుమందులను క్రమంగా తగ్గించి సహజ వనరులతో సహజ వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రస్తుతం వరి నారు మాడులు, మొక్కజొన్న ప్రధాన పంటల్లో కనిపించే చీడపీడలు మరియు వాటి సహజ నివారణ పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏఈఓ చి. తిరుపతి, కృషి సచ భాగ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల యూనిఫామ్‌ల తయారీ త్వరితగతిన పూర్తి చేయాలి

### భూగర్భ జలాల పరిరక్షణకు జలసిరి పనులు వేగవంతం చేయాలి: సీఎస్ సంజయ్ జాజు ఆదేశం

**నిర్మల్, జులై 24, ప్రభాతవార్త**



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల తయారీని వెంటనే పూర్తి చేసి పిల్లలకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుండి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. యూనిఫామ్ తయారీతో పాటు ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణ పరిస్థితులు, పంటల సాగు తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. జిల్లాల వారీగా యూనిఫామ్ తయారీ పురోగతిని అడిగి తెలుసుకుని, తయారీ పూర్తయిన వెంటనే ఆలస్యం చేయకుండా విద్యార్థులకు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం చేపట్టిన˜జలసిర్థి కార్యక్రమం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతుల్లో భూగర్భ జలాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలని, పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ప్రతి మండలంలో విత్తన మేళాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీసీలో నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఈవో భోజన్న, డిఎంహెచ్ఓ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యాన అధికారి రమణ, సిపివో గంగారెడ్డి, ఆర్డబ్ల్యుఎస్, నీటిపారుదల ఈఈలు సందీప్, అనిల్ పాల్గొన్నారు.

## గోర్లపల్లిలో పోలీసుల ముమ్మర తనిఖీలు

### - 60 వాహనాల తనిఖీ.. గుడుంబా స్వాధీనం, 250 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**వేమనపల్లి, జులై 24, ప్రభాతవార్త**



మీ రక్షణ, భద్రతే మా బాధ్యత అని చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ పేర్కొన్నారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోర్లపల్లి గ్రామంలో శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌తో పాటు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ తో పాటు 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొని గ్రామంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 60 వాహనాలను పరిశీలించి, పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 2 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, అక్రమ సారా తయారీకి వినియోగిస్తున్న సుమారు 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో అక్రమ సారా తయారీ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోడ్డు భద్రతా నిబంధనల పాటింపు, గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అవసరంపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి కమ్యూనిటీ పోలీసింగ్‌కు సహకరించాలని గ్రామస్థులను సీఐ కృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొట్రంగి శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు

## రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం: అదనపు కలెక్టర్ వి. రాములు

### కొత్తపల్లిలో రీ సర్వే పరిశీలన - తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ పనుల సమీక్ష

**వేమనపల్లి, జులై 24, ప్రభాతవార్త**



జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు తెలిపారు. శుక్రవారం వేమనపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో తహసీల్దార్ సాయి కృష్ణతో కలిసి రీ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో భూముల హద్దులు స్పష్టంగా నిర్ధారించబడటంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. పట్టాదారుల వివరాలు, మోకా, రెవెన్యూ రికార్డులను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ భూముల గుర్తింపు, ఆక్రమణల నివారణ, పట్టా-మోకా వ్యత్యాసాల పరిష్కారానికి మ్యాపింగ్ ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం వేమనపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ భూ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.